

అన్నదానానికి 1,166 డాలర్లు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి టి.సూర్యకుమార్ (కాకినాడ) 1,166 యూఎస్ డాలర్లు విరాళంగా అందించారు.



కనుమరుగు

రత్నగిరిపై భక్తుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. గత నవంబర్‌లో రూ.10 లక్షలతో వీటిని నిర్మించారు.

8లో

రత్నగిరిపై రయ్‌రయ్..



సత్యదేవుని ఆలయానికి విచ్చేసే భక్తుల కోసం అన్నవరం దేవస్థానం ఆగస్టు నెలాఖరు నుంచి మరో రెండు కొత్త బస్సులను నడపనుంది. దానిలో భాగంగా అశోక్ లైలాండ్ కంపెనీకి చెందిన రెండు బస్సు ఛాసెస్‌ను రూ.57 లక్షలతో కొనుగోలు చేశారు.

న్యూస్‌రీల్

ఏటిగట్ల పటిష్టతకు చర్యలు
మంత్రి దుర్గేష్

పెరవలి: ఉభయ గోదావరి జిల్లాల్లో ఏటిగట్ల శాశ్వత రక్షణకు చర్యలు చేపడతామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఎమ్మెల్యేలతో కలసి ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి వరద ముంపు నుంచి రక్షణ కల్పిస్తామన్నారు. పెరవలిలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఎర్ర కాలువ వల్ల ఏటా రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గట్ల ఎత్తు పెంచి వరద ముప్పు నుంచి రక్షణ కల్పించాలని నిర్ణయించామన్నారు. ఎర్రకాలువ రెగ్యులేటర్ సామర్థ్యం 17 వేల క్యూసెక్కుల నుంచి 25 వేలకు పెంచేలా చర్యలు చేపడతామన్నారు. ఎర్రకాలువ వల్ల ఒక్క నిడదవోలు నియోజకవర్గంలోనే 26 వేల ఎకరాలు మునిగిందని, ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామన్నారు. జిల్లాలో 47 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని ఇవి మూడు నెలలకు సరిపోతాయన్నారు. వరద వల్ల నష్టపోయిన సి క్లాస్ రైతులకు నష్టపరిహారం అందిస్తారా అని ప్రశ్నించగా అందరూ పంటలు వేస్తారు. వారికి అందేలా చర్యలు చేపడతాం. కానీ ఇన్‌పుట్ సబ్సిడీలా రాదన్నారు.

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈగా గొర్ల ప్రసాద్
టీవీఎస్ఎన్ మూర్తి విశాఖకు బదిలీ

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈగా గొర్ల ప్రసాద్ నియమితులయ్యారు. కాకినాడలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఆయనను పదోన్నతిపై రాజమండ్రి సర్కిల్‌లో నియమించారు. ఈ మేరకు ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఈపీడీసీఎల్) సీఎండీ పృథ్వీతేజ్ బుధవారం ఉత్తర్వులు వెలువరించారు. ఇక్కడ ఎస్ఈగా వ్యవహరిస్తున్న టీవీఎస్ఎన్ మూర్తిని పదోన్నతిపై విశాఖపట్నంలోని విద్యుత్ శాఖ కార్పొరేట్ కార్యాలయంలో సీజీఎం(ప్రాజెక్టు)కు బదిలీ చేశారు.

ముందే చెప్పిన 'సాక్షి'

రాజమండ్రి సర్కిల్ ఎస్ఈగా వచ్చేందుకు కాకినాడకు చెందిన ఓ అధికారి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న విషయాన్ని 'సాక్షి' ముందే చెప్పింది. ఈ విషయమై ప్రత్యేక కథనం సైతం ప్రచురించింది. నాడు 'సాక్షి' చెప్పిందే నేడు నిజమైంది. కాకినాడలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న గొర్ల ప్రసాద్ నియామకానికి గ్రీన్ సిగ్నల్ అందింది. నూతన ఎస్ఈగా నియమితులైన ప్రసాద్ గురువారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.

బీఈడీ ప్రవేశాల కమిటీలో ప్రొఫెసర్ కొండ్రు



రాజానగరం: బీఈడీ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కి రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలోని ఇద్దరు సభ్యులలో ఒకరు ఆదికవి నన్నయ యూనివర్సిటీ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్, స్పోర్ట్సు కమిటీ చైర్మన్‌గా ఉన్న ప్రొఫెసర్ కొండ్రు సుబ్బారావు. గత 30 సంవత్సరాలుగా బోధనారంగంలో విశిష్టమైన సేవలందిస్తూ, సీనియర్ అధ్యాపకునిగా గుర్తింపు పొందిన ప్రొఫెసర్ సుబ్బారావు మాట్లాడుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా, బీఈడీ కోర్సులో ప్రవేశాలకు కోసం త్వరలోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

డీఎస్పీల బదిలీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసుశాఖలో డీఎస్పీల బదిలీలు జరిగాయి. ఏపీ డీజీపీ కార్యాలయం ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు జిల్లాలో పనిచేసిన రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.విజయపాల్, సౌత్‌జోన్ డీఎస్పీ అంబికాప్రసాద్, దిశ డీఎస్పీ బి.ఆదినారాయణ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాల్సి వుండగా, ఈస్ట్‌జోన్ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ ఏసీబీ డీఎస్పీగా బదిలీ అయ్యారు. అనంతపురం పీటీసీలో పనిచేసిన కడలి వెంకటేశ్వరరావు రాజమహేంద్రవరం దిశ డీఎస్పీగా రానున్నారు. సెంట్రల్ జోన్ డీఎస్పీగా కృష్ణా డీటీపీసీగా పనిచేసిన కె.రమేష్ బాబు రానున్నారు.

నేటి నుంచి రూ.5కే అమ్మ ఇడ్లీ

రాజానగరం: జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి వెంట వచ్చే వారికి సౌకర్యంగా ఉండే విధంగా గురువారం నుంచి 'అమ్మ ఇడ్లీ' పేరుతో రూ.5కే టిఫిన్‌ని అందించాలని నిర్ణయించామని ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. రోగులు, వారి సహాయకుల కోసం ఇప్పటికే 'అమ్మ భోజన' పథకం పేరుతో రూ.10కు పచ్చడి, కూర, సాంబారు లేదా రసం, మజ్జిగతో భోజనాన్ని అందిస్తున్నామన్నారు. ఆగస్టు ఒకటి నుంచి ఒక చట్నీ, మూడు ఇడ్లీలను రూ.5కు అందించే పథకం ప్రారంభమవుతుందన్నారు. 'సొడెక్సో' వంటలను అందిస్తుందన్నారు. ఈ పథకాలను జీఎస్ఎల్ గ్రూపులోని సంస్థల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు.

గృహోనందలహరీ

- గృహ నిర్మాణాలపై టీడీపీ ప్రభుత్వం వింత ధోరణి
- తాజా నిర్మాణాలకు మాత్రమే రూ.4 లక్షలు ఇస్తామని సీఎం చంద్రబాబు వెల్లడి
- నూతనంగా దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే వర్తింపు
- గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లపై సీతకన్ను
- బాబు నిర్ణయంతో ఆందోళనలో గత ప్రభుత్వంలో లబ్ధిదారులు
- తాము ఏం పాపం చేశామని ప్రశ్న
- తమకూ వర్తింపజేయాలని వేడుకోలు



కొవ్వూరు మండలం కాపవరంలో గృహ ప్రవేశాలకు సిద్ధమైన జగనన్న కాలనీ (ఫైల్)



నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో సుందరంగా రూపుదిద్దుకున్న జగనన్న ఇల్లు(ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: పేదల సొంతింటి కలను ప్రభుత్వం పీడకలగా మారుస్తోంది. పేదల ఇళ్ల నిర్మాణంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలపై వివక్ష చూపుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రజలందరూ సమానమే అన్న నియమాన్ని ఉల్లంఘిస్తోంది. కొత్తగా మంజూరయ్యే గృహ నిర్మాణాలకు మాత్రమే రూ.4 లక్షలు ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. ఈ పరిణామం సొంతిల్లు నిర్మించుకుంటున్న పేదలకు ఆందోళన కలిగిస్తోంది. గత ప్రభుత్వంలో మంజూరై, ప్రస్తుతం వివిధ దశల్లో నిర్మాణ పనులు సాగుతున్న ఇళ్ల పరిస్థితి ఏంటన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వం ఏదైనా పక్షపాత ధోరణి అవలంబించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నిస్తున్నారు. తమకు సైతం రూ.4 లక్షల నిబంధన వర్తింప చేయాలని కోరుతున్నారు.

ఇదీ సంగతి..

పేదల గృహ నిర్మాణాలపై టీడీపీ ప్రభుత్వం సరికొత్త నిబంధన తీసుకువస్తోంది. రాష్ట్ర గృహ నిర్మాణ పథకాన్ని ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0కి అనుసంధానం చేసి ఇకపై ఇంటి కోసం ఎంపిక చేసే లబ్ధిదారులకు ఒక్కో ఇంటికి రూ.4 లక్షలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్రం వాటా 40 శాతంగా నిర్ధారించింది. ఈ మేరకు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఇంకే ముంది గతంలో ఇస్తున్న మొత్తం కంటే ప్రస్తుతం పెరుగుతోంది కదా? అనుకుంటే పొరపాటే.. అందులో తిరకాసు ఉంది. కొత్తగా ఇళ్లు కావాలని దరఖాస్తు చేసుకుని, ఎంపికై న లబ్ధిదారులకు మాత్రమే ఇది వర్తిస్తుందని ప్రభుత్వం మెలిక పెట్టింది. లబ్ధిదారుల ఎంపికపై సర్వే చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామం ఇప్పటికే ఇంటి నిర్మాణాలు చేపడుతున్న పేదలను కలవరపాటుకు గురిచేస్తోంది. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్లపై ఇంత కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం ఏంటని ప్రశ్నిస్తున్నారు. తాము పేదలం కాదా? తమ సొంతింటి కల నెరవేరకూడదా..? అని దుమ్మెత్తిపోస్తున్నారు.

నయాపైసా ఖర్చు లేకుండా...

జగనన్న కాలనీల్లో నిర్మించే ఇళ్లకు లబ్ధిదారులు విద్యుత్ కనెక్షన్ పొందేందుకు నయాపైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. ఒక్కో కనెక్షన్‌కు సుమారు రూ.2,500 ఖర్చవుతుంది. ఇలా ఒక్కో లేఅవుట్‌కు సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని విద్యుత్ శాఖ అధికారులు అంచనాలు రూపొందించారు. అయినా ఖర్చుకు వెనకాడకుండా పేదల ఇళ్లకు ఉచిత వెలుగులు అందించే దిశగా గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ సర్వీసు వైరు, మీటరు, బోర్డు ఉచితంగా ఇవ్వనున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసి వారిచ్చిన రసీదును సంబంధిత ఏఈ కార్యాలయంలో అందజేస్తే సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేయకుండా కనెక్షన్ అమరుస్తున్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌కు జగన్న ఇళ్ల పథకంలో వెలుగుబంద గ్రామంలో అతిపెద్ద లేఅవుట్ కేటాయించారు. ఒకే చోట 13,069 ఇళ్ల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన జరుగుతోంది.

రూ.567 కోట్లు వెచ్చింపు

పేదలకు సొంత గూడు కల్పించాలన్న తలంపుతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి భారీగా నిధులు వెచ్చించింది. కేవలం ఇంటి నిర్మాణాలకు ఏకంగా రూ.567.11 కోట్లు ఖర్చు చేసింది. భూములు స్వయంగా కొనుగోలు చేసి మరీ లబ్ధిదారులకు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కింది. ఇంత భారీ స్థాయిలో ఏ ప్రభుత్వం కేటాయించిన దాఖలాలు లేవని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

జిల్లాలో గృహ నిర్మాణ పురోగతి ఇలా..

నియోజకవర్గం	మంజూరైన గృహాలు	బీబీఎల్ (బిలో బేస్‌మెంట్ లెవెల్)	పూర్తయినవి	వెచ్చించిన మొత్తం (రూ.లక్షల్లో)
అనపర్తి	9,925	2,553	3,521	78.43
గోపాలపురం	9,545	5,532	1,162	35.48
గోకవరం	1,137	335	369	7.75
కొవ్వూరు	13,405	3,788	3,531	111.39
రాజమండ్రి సిటీ	11,771	4,718	2,238	98.97
రాజమండ్రి రూరల్	5,315	2,198	1,989	38.71
రాజానగరం	7,554	2,074	4,015	72.99
నిడదవోలు	12,772	4,235	6,583	123.38

జిల్లాలో 46,180 లబ్ధిదారుల పరిస్థితేంటో?

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 71,424 ఇళ్లు నిర్మించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ప్రతి ఒక్క ఇంటి పనులు ప్రారంభించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారు. 67,498 గృహ నిర్మాణ పనులు ప్రారంభించి 95 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. మిగిలిన 3,926 ప్రారంభించాల్సి ఉంది. ఇప్పటికి 25,244 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేపట్టి తమ సొంతింటి కలను సాకారం చేసుకున్నారు. మిగిలిన 46,180 గృహాలు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. వీటి నిర్మాణాలు వేగవంతం చేయడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. సార్వత్రిక ఎన్నికలు సమీపించడం, ఎన్నికలు పూర్తవడం, కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో నిర్మాణ పనులు నెమ్మదించాయి. దీనికి తోడు కొత్త మార్గదర్శకాల ప్రకారం ఒక్కో ఇంటికి రూ.4 లక్షలు ఇచ్చే నిబంధన తమకు వర్తించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఎక్కువ శాతం గృహ నిర్మాణాలకు (బిలో బేస్‌మెంట్ లెవెల్) సిద్ధమవుతున్నవారు 25,436 మంది ఉన్నారు. వీళ్ల పనులు ప్రారంభించాలా? లేదా? అన్న సందిగ్ధంలో ఉన్నారు.

అందరికీ ఇవ్వాలి



సొంతిళ్లు కట్టుకోవాలని ప్రతి ఒక్కరూ కలగన్నారు. వాటిని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిజం చేసింది. అప్పుడు ప్రారంభమైన నిర్మాణ పనులు ఇంకా జరుగుతున్నాయి. వాటికి ప్రాధాన్యం కల్పించకూడదన్న ఉద్దేశంతో ప్రస్తుత ప్రభుత్వం ఉంది. అది మంచి పద్ధతి కాదు. ప్రతి లబ్ధిదారుడికి కొత్తగా ప్రకటించిన విధంగా రూ.4 లక్షలు ఇవ్వాలి.

– కంటే వినయ్‌తేజా, బూరుగుపూడి, కోరుకొండ మండలం

ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇవ్వండి



ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షలు నగదు సహాయాన్ని అందించాలి. పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే సహాయానికి మమ్మల్నీ గుర్తించాలి. కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన నేను పెయింటింగ్ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాను. నాకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సొంతిల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నాను. అద్దె చెల్లించడం ఇబ్బందిగా ఉంది. జగనన్న ప్రభుత్వం నాలాంటి పేదలకు ఇంటి స్థల పట్టాలు ఇచ్చింది. అయితే కోర్టు వివాదాల కారణంగా స్థలాన్ని అప్పగించలేదు. దీంతో పట్టా ఉన్నప్పటికీ ఇల్లు నిర్మించలేదు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన రూ.4 లక్షల నగదు అందించే కార్యక్రమాన్ని నాలాంటి వారందరికీ వర్తింపజేయాలి.

– ఇంజే విజయకుమార్, బూరుగుపూడి, కోరుకొండ మండలం

నేడు సాధారణ స్థాయికి...

- తగ్గుతున్న వరద ఉధృతి
- నేడు ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే అవకాశం
- పది రోజులుగా అమల్లో ఉన్న ప్రమాద హెచ్చరికలు



కాటన్ బ్యారేజీ నుంచి విడుదలవుతున్న మిగులు జలాలు

ధవళేశ్వరం: పది రోజులుగా ఉగ్రరూపం చూపిన గోదావరి క్రమేపీ తగ్గుముఖం పట్టింది. గురువారం ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. జూలై 22వ తేదీ ఉదయం 7గంటలకు ధవళేశ్వరం వద్ద 11.75 అడుగులకు నీటిమట్టం చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ప్రకటించారు. అనంతరం రెండవ ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి నీటిమట్టం చేరినా అనంతరం తగ్గుముఖం పట్టడంతో రెండవ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఎగువ ప్రాంతాల్లో పెరుగుతూ తగ్గుతూ ఉండటంతో పది రోజులుగా ధవళేశ్వరం వద్ద నీటి ఉధృతి పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టలేదు. దీంతో అప్పటి నుంచి మొదటి ప్రమాద హెచ్చరిక అమల్లోనే ఉంది. గురువారం ధవళేశ్వరం వద్ద నీటి ఉధృతి మరింత తగ్గుముఖం పట్టి మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే అవకాశం ఉంది. బుధవారం ఉదయం 12.10 అడుగులకు చేరిన నీటిమట్టం రాత్రి 8గంటల వరకు అదే స్థాయిలో నిలకడగా కొనసాగింది. కాటన్ బ్యారేజీ నుంచి 10,41,489 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి 9,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టా 1,200, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఎగువ ప్రాంతాలకు సంబంధించి కాళేశ్వరంలో 9.85 మీటర్లు, పేరూరులో 15.48 మీటర్లు, దుమ్ముగూడెంలో 12.17 మీటర్లు, భద్రాచలంలో 44.80 అడుగులు, కూనవరంలో 19.06 మీటర్లు, కుంటలో 10.37మీటర్లు, పోలవరంలో 12.36మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.12 మీటర్ల వద్ద నీటి మట్టాలు నెలకొన్నాయి.

రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- బొబ్బిల్లంక ఏటిగట్టు, ముంపులో ఉన్న పొలాల పరిశీలన



బొబ్బిల్లంక వద్ద వరదతో ముంపునకు గురైన పంటపొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజా

సీతానగరం: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బొబ్బిల్లంకలో ఆయన పర్యటించారు. బొబ్బిల్లంక స్లూయిజ్ వద్ద గోదావరి వరద నీటిమట్టం, అశోక్‌నగర్ వద్ద కోతకు గురైన ఏటిగట్టును పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో సీతానగరం, కోరుకొండ మండలాల్లో వేలాది ఎకరాలు నీటి మునిగాయన్నారు. రైతులు సాగు చేసే సమయంలో వరద నీరు చేరడంతో తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రకృతి వైపరీత్యాలు, లేకుంటే వర్షాలు పడక పంట ఎండిపోతుందనే నానుడి రైతుల్లో ఉందని రాజా అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. గోదావరి వరద పెరగడంతో బొబ్బిల్లంక స్లూయిజ్ డోర్లు మూసుకుపోయి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు ఎక్కువగా రావడంతో పంటపొలాలు మునిగి రైతులు నష్టపోయారని ఆయన తెలిపారు.

రివర్స్ పంపింగ్ స్కీమ్

వైఎస్సార్ సీపీ హయాంలో బొబ్బిల్లంక వద్ద రివర్స్ పంపింగ్ స్కీమ్ నెలకొల్పడానికి రూ.91 కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు కూడా పిలిచామని, పనులు వెంటనే ప్రారంభించాలని రాజా కోరారు. సీతానగరం మండలంలో 24 కిలోమీటర్ల ఏటిగట్టు ఉందని, తొర్రిగడ్డ కాలువలో నీరు బొబ్బిల్లంక వద్ద తోడి గోదావరిలో కలపడం వల్ల వరదలు నివారించవచ్చని తెలిపారు. ఏటిగట్టును ఆనుకుని ఎర్త్ బాండ్స్ బలహీనంగా ఉన్నాయని వీటి మరమ్మతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.24 కోట్లు అంచనా వ్యయంతో డిజాస్టర్ మేనేజ్మెంట్ నుంచి నిధులు మంజూరు చేయమని కోరామని, ఆ పనులు ప్రారంభించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో ఏ కాలంలో నష్టపోయిన రైతులకు ఆ కాలంలోనే నష్టపరిహారం అందించామని, నేడు అందుకు భిన్నంగా ఉందన్నారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సర్పంచ్ మెల్లిమి రామచంద్రరావు, ఉపసర్పంచ్ వీరబాబు, ఎంపీటీసీ సభ్యుడు చిన్ని పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు రంగం సిద్ధం

- ఈ నెల 8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు
- నేడు షెడ్యూల్ విడుదల
- 5న అభ్యంతరాల స్వీకరణ
- జిల్లాలోని 985 స్కూళ్లలో నిర్వహణ





పేరెంట్స్ కమిటీ ఎన్నికల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహిస్తున్న అర్బన్ రేంజ్ డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ విద్యాసంస్థల్లో పేరెంట్స్ కమిటీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ మానిటరింగ్ కమిటీల స్థానంలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. దీనికి గురువారం నోటిఫికేషన్ వెలువడనుంది. జిల్లాలో యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించే దిశగా జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు సంబంధిత అధికారులకు అదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించి బుధవారం జిల్లా వ్యాప్తంగా స్థానిక విద్యాశాఖాధికారులు ఆయా స్కూల్స్ ప్రధానాపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.యాజమాన్య కమిటీ ఎన్నికలను జాగ్రత్తగా నిర్వహించే దిశగా చర్యలు చేపట్టారు. ఎన్నికల్లో నిబంధనలు, సూచనలు కచ్చితంగా పాటించాలి. ఈ నెల 8వ తేదీన ఎన్నికలు జరగనుండగా, 5వ తేదీ అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రధానోపాధ్యాయుడు కమిటీ ఎన్నిక బాధ్యత తీసుకుంటారు. ఎన్నికల నిర్వహణకు కనీసం 50 శాతం మంది తల్లిదండ్రులు, సంరక్షకులు హాజరు కావాలి. కోరం ఏర్పడటానికి సమయ పరిమితిని హెడ్‌మాస్టర్ నిర్ణయిస్తారు. ఎన్నికలు సాధారణంగా చేతులు చూపించడం, వాయిస్ ఓటు ద్వారా నిర్వహిస్తారు. అపరిష్కృత వివాదాల అసాధారణ పరిస్థితుల్లో రహస్య బ్యాలెట్ విధానాన్ని అవలంబించవచ్చు. పేరెంట్, గార్డియన్ రిప్రజెంటేటివ్ ఎన్నికకు తల్లిదండ్రులలో ఒకరు మాత్రమే ఓటు వేయడానికి అర్హులు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీకి ఎన్నికైన సభ్యుల నుంచి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ను ఎన్నుకుంటారు. ప్రాధాన్యంగా తల్లిదండ్రుల సభ్యుల్లో కనీసం ఒకరు వెనుకబడిన, బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు తల్లిదండ్రులు అయివుండాలి. వారిలో కనీసం ఒకరైనా మహిళ అయివుండాలి. స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యులు, ప్రధాన ఉపాధ్యాయులు, ఇన్‌చార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు ఎన్నికలలో పాల్గొనడానికి అనర్హులు. వారికి ఎలాంటి ఓటు హక్కు ఉండదు. ఎలాంటి రాజకీయ జోక్యం ఉండకూడదు. పునర్నిర్మాణ ప్రక్రియలో అంతరాయం కలిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. తహశీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రామ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ సహాయకుడు ఎన్నికల ప్రక్రియలో పరిశీలకులుగా పాల్గొనవచ్చు. ప్రతి ఓటరు రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ వంటి పత్రాలు తీసుకురావాలి.

కట్టుదిట్టంగా నిర్వహిస్తాం



పేరెంట్స్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడింది. దీనికి సంబంధించి విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ దిశగా జిల్లావ్యాప్తంగా పీఎంసీ ఎన్నికలు సక్రమంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా స్కూలు ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయులందరూ అకడమిక్ క్యాలెండర్‌లో అన్ని విషయాలు కచ్చితంగా పాటించాలి. స్కూలు హెచ్ఎంలు, స్థానిక విద్యాశాఖాధికారులు స్కూలు పేరెంట్స్ కమిటీ ఎన్నికలు జాగ్రత్తగా నిర్వహించాలి.

-కె.వాసుదేవరావు, జిల్లా విద్యాశాఖాధికారి. తూర్పుగోదావరి జిల్లా

ఎన్నికలు జరిగే ప్రభుత్వ స్కూళ్లు

ప్రైమరీ స్కూళ్లు	711
అప్పర్ ప్రైమరీ స్కూళ్లు	72
హైస్కూళ్లు	183
హైస్కూలు ప్లస్	19
ప్రభుత్వ స్కూళ్లు మొత్తం	985

గైట్‌లో సమగ్ర ఫోరెన్సిక్‌పై శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

రాజానగరం: స్థానిక గైట్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ విద్యార్థులకు సమగ్ర ఫోరెన్సిక్ బాలిస్టిక్స్‌పై బుధవారం శిక్షణ ఇచ్చారు. కాకినాడ గ్రూప్ ఎన్‌సీసీ 18 ఆంధ్ర బెటాలియన్‌కు చెందిన ఎన్‌సీసీ, ఆర్మీ అధికారులు ఈ శిక్షణను నిర్వహించారు. తుపాకీలోని భాగాలు, వాటి పనితీరుపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ప్రత్యేకంగా 0.22 రైఫిల్, సెల్ఫ్ లోడింగ్ రైఫిల్ ఆయుధాల సాంకేతిక అంశాలు, కార్యాచరణ విధానాలను వివరించారు. తుపాకీల మెకానిజమ్‌పై కూడా అవగాహన కలిగించారు. ఈ శిక్షణ విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ఏలేశ్వరం: మండలంలోని సి.రాయవరం గ్రామానికి చెందిన గజ్జి అప్పన్న (60) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. గ్రామంలోని ఊటగుంతలో అతడు పడి ఉండటాన్ని బుధవారం స్థానికులు గమనించారు. దగ్గరకు వెళ్లి చూడగా అప్పన్న మృతి చెంది ఉన్నాడు. అతడి ఒంటిపై గాయాలున్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రత్తిపాడు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి..

కొత్తపల్లి: పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉప్పాడ వీవర్స్ కాలనీకి చెందిన నాదెండ్ల వరుణ్ (17) ఇంటర్ మొదటి సంవత్సరంలో నాలుగు సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై గత నెల 16వ తేదీన పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని చికిత్స కోసం కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై హెడ్ కానిస్టేబుల్ రాజారావు కేసు నమోదు చేశారు.

మృతదేహం లభ్యం

సఖినేటిపల్లి: మలికిపురం సరిహద్దులోని టేకిశెట్టిపాలెం వద్ద పంట కాలువలో ప్రమాదవశాత్తూ పడి గల్లంతయిన సఖినేటిపల్లి గ్రామానికి చెందిన చీర్ల దుర్గారావు మృతదేహం బుధవారం లభ్యమైంది. సఖినేటిపల్లి సమీపంలోని పరంజ్యోతి చర్చి దగ్గర కాలువలో తేలింది. మృతదేహాన్ని బయటకు తీసి పోస్ట్‌మార్టానికి పంపినట్లు ఎస్సై రాము తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్‌లు నడిపిన ఆరుగురికి రెండు రోజుల జైలు, మరో 12 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, త్రీ టౌన్, తిమ్మాపురం స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి రెండు రోజులు జైలు శిక్ష, 12 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మరో కోర్టులో..

కాకినాడ వన్ టౌన్, తాళ్లరేవు మండలం కోరంగి పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి బైక్ నడుపుతున్న వారిని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. వారిలో ఐదుగురికి రెండు రోజుల జైలు, తొమ్మిది మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు.

వ్యక్తికి పాముకాటు

అయినవిల్లి: వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన ముద్దన ప్రకాశరావు (దొరబాబు) అనే వ్యవసాయం కూలీ పాముకాటుకు గురయ్యాడు. పొలానికి వెళ్లిన అతడిని అక్కడకు వరదకు కొట్టుకు వచ్చిన పాడపాడు కాటేసింది. గమనించిన స్థానికులు దొరబాబును వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

కనుమరుగు

- అన్నవరంలో మరుగుదొడ్ల దుస్థితి
- పశ్చిమ రాజగోపురం వద్ద నిర్మాణం
- రూ.10 లక్షలు ఖర్చుచేసిన దేవస్థానం
- అధ్వానంగా మారిన వైనం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం నిత్యం రద్దీగా ఉంటుంది. కొండపై కొలువైన వీర వెంకట సత్యనారాయణస్వామిని దర్శించుకోవడానికి అనేక మంది భక్తులు తరలివస్తారు. పండగలు, పర్వదినాలలో వీరిసంఖ్య దాదాపు రెట్టింపు ఉంటుంది. ఆలయానికి వచ్చే భక్తుల కోసం దేవస్థానం అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. దానిలో భాగంగా పశ్చిమ రాజగోపురం సమీపంలో గతేడాది నవంబర్‌లో మరుగుదొడ్లను నిర్మించారు. వీటి కోసం దాదాపు రూ.10 లక్షలు ఖర్చు చేశారు. కానీ అవి అప్పుడే నిరుపయోగంగా మారింది. దాదాపు 8 నెలలకే అధ్వానంగా తయారయ్యాయి.

ఆధునిక శైలిలో..

పశ్చిమరాజగోపురం పక్కన గల షాపింగ్ కాంప్లెక్స్ దిగువన వెస్ట్రన్ స్టైల్ కమోడ్స్‌తో పురుషులు, మహిళలకు విడివిడిగా పది మరుగుదొడ్ల నిర్మించారు. గత ఏడాది కార్తిక మాసం సందర్భంగా భక్తుల కోసం వీటిని ఏర్పాటు చేశారు. అయితే వీటిలోని వాటర్ బాక్సులను గుర్తు తెలియని వ్యక్తులు పీకేశారు. వాటికి సరఫరా అవుతున్న నీరు వృథాగా పోతోంది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో మరుగుదొడ్ల వద్ద సిబ్బంది ప్లాస్టిక్ బకెట్లను ఏర్పాటు చేశారు. దాదాపు రూ.10 లక్షల ఖర్చుతో నిర్మించిన మరుగుదొడ్లు ఎనిమిది నెలలకే అధ్వానంగా మారాయి. వాటి పరిస్థితి చూసి భక్తులు ఎవ్వరూ లోపలకు వెళ్లడం లేదు.



నేలమీద ఏర్పాటు చేసిన బోర్డు


అధ్వానంగా..

మరుగుదొడ్లలో సాధారణ బేసిన్లను ఉపయోగిస్తారు. కానీ వీటిలో వెస్ట్రన్ కమోడ్లు వాడడంతో చాలామందికి వినియోగించడం తెలియడం లేదు.



పశ్చిమ రాజగోపురం వద్ద గల టాయిలెట్స్‌లో కనిపించని వాటర్ బాక్సులు

పశ్చిమరాజగోపురం సమీపంలో తప్ప ఈ తరహా మరుగుదొడ్ల దేవస్థానంలో ఎక్కడా లేవు. కేశఖండనశాలలో ఉన్నప్పటికీ అవి తలనీలాలు సమర్పించిన వారికే ఉపయోగపడతాయి. సాయంత్రం ఆరు గంటలు దాటితే వాటి గేట్లు మూసివేస్తారు. దీంతో ఈ మరుగుదొడ్లను 24 గంటలూ భక్తులు ఉపయోగించుకునే అవకాశం ఉంది. కానీ వీటి పరిస్థితి దారుణంగా తయారైంది.



నేలమీద పడిఉన్న వాటర్ బాక్సులు

లోపభూయిష్టం

మరుగుదొడ్ల నిర్వహణ మొదటి నుంచీ లోపభూయిష్టంగానే ఉంది. ఇక్కడ మరుగుదొడ్ల ఉన్న విషయం భక్తులకు తెలిసేలా కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. వీటిలోకి వెళ్లడానికి మెట్లను కూడా దాదాపు నెలల తర్వాత నిర్మించారు. ఉన్న పది వాటిలో ఒక దాని పరిస్థితి చాలా అధ్వానంగా ఉండడంతో దాన్ని మూసివేశారు. కాగా.. పశ్చిమ రాజగోపురం సమీపంలో నిర్మించిన మరుగుదొడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని దేవస్థానం అధికారులకు చైర్మన్ ఐవీ రోహిత్ ఆదేశించారు. వాటి పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

ముంపు బాధితులకు అరకొర సాయం

అంబాజీపేట: గోదావరి వరద ఉధృతికి జిల్లాలో అనేక ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. చాలా కుటుంబాలు ఇప్పటికీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వారికి ప్రభుత్వం నిత్యావసరాలు పంపిణీ చేస్తుంది. అయితే వాటిని అరకొరగా అందజేస్తుండడంతో వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. అంబాజీపేట మండలం నందంపూడి బొంతువారిపేట, వాకలగరువు, తొండవరం నవుండ్రువారిపేట, రజకపేటలలో 200 ఇళ్లు నీట మునిగాయి. వరద ముంపు ప్రాంతాల్లో అధికారులు తూతూమంత్రంగా సర్వే నిర్వహించి, వివరాలు నమోదు చేసుకున్నారు. దీనిలో భాగంగా 54 ఇళ్లకు సంబంధించి ఉల్లిపాయలు, బంగాళదుంపలు, బియ్యం పంపిణీ చేశారు. మిగిలిన పామాయిల్, కందిపప్పు ఇవ్వలేదు. గత రెండు రోజులుగా వరద పెరిగిపోవడం, పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు స్పందించి తిరిగి సర్వే చేసి, 56 ఇళ్లు కాకుండా 96 కుటుంబాలను గుర్తించారు. అయితే వారికి కూడా నేటికి బియ్యం, పామాయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు పంపిణీ చేయలేదు. దీనిపై తహసీల్దార్ జె.విమలకుమారిని వివరణ కోరగా.. కందిపప్పు, పామాయిల్ ఇంకా సరఫరా కాలేదన్నారు. నూతనంగా గుర్తించిన బాధితులకు ప్రభుత్వ సాయం పంపిణీ చేయాల్సి ఉందన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టామని రాగానే పంపిణీ చేస్తామన్నారు.

ఉపాధ్యాయ ఓటరు జాబితాకు షెడ్యూల్ విడుదల

కాకినాడ సిటీ: తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయుల నియోజక ఓటరు జాబితా తయారు చేసేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నియోజకవర్గాలకు సంబంధించి ఇప్పటికే ఉన్న ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారందరూ నిర్ణీత ఫారం-19 తాజాగా సమర్పించాలని డీఆర్వో డి.తిప్పేనాయక్ తెలిపారు. ఆయన బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఏపీ శాసన మండలి తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయుల నియోజకవర్గం ఓటరు జాబితాలో నమోదు కావడానికి ఈ ఏడాది నవంబర్ ఒకటో తేదీ వరకూ అవకాశం ఉందన్నారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు, (రంపచోడవరం, చింతూరు డివిజన్లు), ఏలూరు జిల్లాలలోని ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న అర్హత గల ఉపాధ్యాయులు, లెక్చరర్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారంతో పాటు గడిచిన ఆరేళ్లలో మూడు సంవత్సరాల పాటు ఉన్నత పాఠశాల, కళాశాలల్లో పనిచేసినట్టు ధ్రువీకరణపత్రం కలిగి ఉండాలన్నారు. 2021 డిసెంబర్ ఒకటో తేదీ తర్వాత ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు ఓటు నమోదుకు అర్హులన్నారు. మొదటి, రెండో రీపబ్లికేషన్ ఆఫ్ నోటీసులు ఈ నెల 13, 23 తేదీలో జారీ చేస్తారన్నారు. ఫారం 19 అందజేసేందుకు సెప్టెంబర్ 3వ తేదీ వరకూ అవకాశం ఉందన్నారు.

రత్నగిరిపై రయ్‌రయ్..

- త్వరలో అన్నవరానికి రెండు కొత్త బస్సులు
- కొనుగోలు చేసిన దేవస్థానం
- ఆగస్టు నెలాఖరుకు అందుబాటులోకి..

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి విచ్చేసే భక్తుల కోసం అన్నవరం దేవస్థానం ఆగస్టు నెలాఖరు నుంచి మరో రెండు కొత్త బస్సులను నడపనుంది. దానిలో భాగంగా అశోక్ లైలాండ్ కంపెనీకి చెందిన రెండు బస్సు చాసిస్‌ను రూ.57 లక్షలతో బుధవారం కొనుగోలు చేశారు. వాటికి విజయవాడలోని అశోక్ లైలాండ్ షోరూమ్‌లో దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ పూజలు నిర్వహించారు. అనంతరం వాటిని నందిగామలోని బాడీ బిల్డింగ్ సెంటర్‌కు తరలించారు. 40 ప్లస్ వన్ సీట్ల కెపాసిటీ కలిగిన ఈ బస్సులు బాడీ బిల్డింగ్ పని పూర్తి చేసుకుని ఆగస్టు నెలాఖరుకల్లా దేవస్థానానికి చేరుకుంటాయని ఈఓ తెలిపారు. వీటికి మొత్తం రూ.80.60 లక్షల వ్యయమవుతోందని వివరించారు.



నూతనంగా కొనుగోలు చేసిన బస్సు చాసిస్‌లకు పూజ చేస్తున్న ఈఓ రామచంద్ర మోహన్

తీరనున్న భక్తుల ఇబ్బందులు

అన్నవరం దేవస్థానం ప్రస్తుతం ఏడు బస్సులను నడుపుతోంది. వాటిలో రెండు బస్సులు ఎప్పుడు మరమ్మతులకు గురై షెడ్డులోనే ఉంటాయి. మిగిలిన వాటిలో మూడు రైల్వేస్టేషన్ నుంచి రత్నగిరికి, మిగిలిన రెండూ కొండదిగువ నుంచి రత్నగిరికి భక్తులను తీసుకువెళుతున్నాయి. అయితే ఇవి సమయానికి అందుబాటులో లేకపోవడంతో భక్తులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా సుమారు వంద ఆటోలు రైల్వేస్టేషన్ - రత్నగిరి మధ్య తిరుగుతున్నాయి. అన్నవరం రైల్వేస్టేషన్ నుంచి రత్నగిరికి బస్సు టిక్కెట్ రూ.20, అదే ఆటో డ్రైవర్లు ఒక్కో భక్తుడికీ రూ.50 వసూలు చేస్తున్నారు. అంతమొత్తం చెల్లించలేని భక్తులు దేవస్థానం బస్సులు వచ్చేవరకూ వేచి ఉండాల్సి వస్తుంది.



రత్నగిరిపై పశ్చిమరాజగోపురం వద్ద దేవస్థానం బస్సులు

నెలాఖరుకు అందుబాటులోకి..



నూతనంగా కొనుగోలు చేసిన రెండు బస్సుల చాసిస్‌లకు బాడీ బిల్డింగ్ పూర్తి చేసి ఆగస్టు నెలాఖరు కల్లా దేవస్థానానికి పంపిస్తారు. ఈ బస్సులను నడపడం వలన భక్తులకు మరంత సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రైవేటు వాహనాలలో భక్తుల నుంచి ఎక్కువ సొమ్ములు వసూలు చేస్తున్నారనే అభిప్రాయం ఉంది. కొత్త బస్సుల రాకతో ఆ సమస్యలు తప్పుతాయి.

– కె.రామచంద్ర మోహన్, ఈఓ

చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- నాసిరకం ఎరువులను అరికట్టాలి
- ఎరువుల ప్రయోగశాల డీడీ అరుణ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కేంద్ర ప్రభుత్వ ఎరువుల నియంత్రణ చట్టాన్ని సమర్థంగా అమలు చేసి, నకిలీ ఎరువులు, పురుగు మందులను నియంత్రించవచ్చని కేంద్ర రాష్ట్రీయ ఎరువుల నియంత్రణ ప్రయోగశాల ఉప సంచాలకుడు అరుణ్ అన్నారు. రాజమహేంద్రవరంలో మూడు రోజుల పాటు వివిధ జిల్లాల మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులకు నిర్వహించిన శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. సభకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ మండలాల్లోని ఎరువులు, పురుగు మందుల దూకాణాలను నిత్యం పర్యవేక్షించి, రైతులకు నాణ్యమైన ఎరువులు పురుగు మందులు అందించేలా వ్యవసాయ అధికారులు కృషి చేయాలన్నారు. ఎరువులు, పురుగు మందులు నిత్యావసర చట్ట పరిధిలోకి వచ్చినందున, అక్రమాలను నిరోధించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి దుకాణం వద్ద నిల్వ బోర్డులు ప్రదర్శించాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు కృపాదాస్ మాట్లాడుతూ మండల వ్యవసాయ అధికారులు ఆయా మండలాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. తద్వారా పారదర్శకంగా దుకాణాల నిర్వహణ జరగాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు మాట్లాడారు. కైకలూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు గంగాధర్ ఎరువుల నియంత్రణ చట్టంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం, కోరుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరావు, వ్యవసాయ అధికారులు భీమరాజు, శ్రీనివాస్, సూర్యరమేష్, శాంతా ఆలివ్, వాణి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన వ్యవసాయాధికారులు

అన్నవరానికి కొత్త ఈఓగా రెవెన్యూ అధికారి!

అన్నవరం: వీర వేంకట సత్యనారాయణస్వామి దేవస్థానానికి నూతన కార్యనిర్వాహణాధికారి (ఈఓ) సీనియర్ రెవెన్యూ అధికారిని నియమించేందుకు రంగం సిద్ధమైంది. రాయలసీమ జిల్లాలో ఆర్డీఓగా పనిచేస్తున్న ఆ అధికారి కోస్తా జిల్లాలో బలమైన సామాజిక వర్గానికి చెందినవారని, గతంలో తొండంగి ఎంఆర్‌ఓగా పనిచేశారని తెలుస్తోంది. అతడిని ఈఓగా నియమించాలని మెట్ట ప్రాంతానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు సిఫారసు చేయడంతో ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, రెండు మూడు రోజుల్లో ఆదేశాలు వెలువడతాయని సమాచారం. తిరుపతి ఆర్‌జేసీగా పనిచేస్తున్న ఎన్వీ సత్యనారాయణమూర్తి ఈఓగా నియమించాలని తొలుత ప్రయత్నాలు జరిగినా ప్రజాప్రతినిధులు ఆర్డీఓ వైపు మొగ్గు చూపడంతో ఆ ప్రయత్నాలకు బ్రేక్ పడినట్టు చెబుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గతంలో ఈఓలుగా రెవెన్యూ అధికారులను నియమించారు. 2002లో దేవస్థానం ఈఓగా గ్రూప్ వన్ అధికారి ఎంవీ శేషగిరి బాబు, ఆయన బదిలీ తరువాత ఇన్‌చార్జి ఈఓగా ప్రస్తుత దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, 2015లో కాకర్ల నాగేశ్వరరావు, ఆ తర్వాత ఎం.జితేంద్రలను టీడీపీ ప్రభుత్వం నియమించింది. కాగా.. దేవదాయ, ధర్మదాయశాఖ అడిషనల్ కమిషనర్-2 కె.రామచంద్రమోహన్ ప్రస్తుతం దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. ఆయన వ్యక్తిగత కారణాలతో ఈ నెల ఏడు నుంచి 15 రోజులు సెలవు పెడుతున్నారు. ఈ లోపుగానే దేవస్థానం ఈఓగా మరొకరిని నియమించే అవకాశం ఉంది. రామచంద్రమోహన్‌కు గత నెలలో కమిషనర్ కార్యాలయంలో కీలక బాధ్యతలు అప్పగించిన విషయం విదితమే. రాష్ట్ర వ్యాప్తంగా దేవదాయ, ధర్మదాయశాఖలోని ఏసీ క్యాడర్ నుంచి ఆర్‌జేసీ క్యాడర్ వరకు సిబ్బంది విధులకు సంబంధించిన ఫైళ్లను ఆయన పరిష్కరించాల్సి ఉంది. దీంతో పాటు అన్నవరం దేవస్థానంలో కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఇందులో భాగంగా వారంలో సోమవారం నుంచి గురువారం వరకు కమిషనర్ కార్యాలయంలో, మిగిలిన మూడు రోజులు అన్నవరం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్నారు.

బాల దివ్యాంగుల పరిరక్షణకు కృషి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బాల దివ్యాంగుల పరిరక్షణకు కృషి చేయాలని, వారికి విద్య, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ బాల దివ్యాంగులు తమ హక్కులకు దూరం కాకూడదని, వివిధ కారణాల చేత పొందలేకపోతే సంబంధిత శాఖ అధికారులు వారికి చేయూత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలను వారి వద్దకు చేర్చాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, 3వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీరమ్య, 7వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.బాబు, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి గంధం సునీత

సత్యదేవునికి ఘనంగా ఏకాదశి పూజలు

అన్నవరం: ఆషాఢ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్యదేవునికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు స్వర్ణపుష్పాలతో అష్టోత్తర పూజలు, తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. సత్యదేవుని ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సుమారు 30 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించి పూజలు చేశారు. అనంతరం సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షలు ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. సుమారు నాలుగు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో భోజనం చేశారు. కాగా..సత్యదేవుడు, అనంతలక్ష్మి, సత్యవతీదేవి అమ్మవారు, ఈశ్వరుడు గురువారం శిలారూపంలో భక్తులకు నిజరూప దర్శనం ఇవ్వనున్నారు.

యథాస్థానాలకు సబ్ రిజిస్ట్రార్లు

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ల డిప్యూటేషన్‌ను రద్దు చేసి, వారిని యథాస్థానానికి బదిలీ చేస్తూ స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రాష్ట్ర ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కాకినాడ రూరల్ మండలం సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న సి.రమేష్ మామిడికుదురుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కేవీ శ్రీనివాసరెడ్డిని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. పిఠాపురం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వీబీ నర్సమాంబ తన యథాస్థానం భీమవరానికి సబ్ రిజిస్ట్రార్ -2గా బదిలీ అయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం సబ్ రిజిస్ట్రార్ ఎ.సత్యనారాయణను విజయవాడ మార్కెట్ అండ్ ఆడిట్ విభాగానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎంవీ సుధారాణిని నియమించారు. ఎంవీ.సుధారాణి మలికిపురం సబ్‌రిజిస్ట్రార్ అయినప్పటికీ ఆమె డిప్యూటేషన్‌పై ఉండి విధులు నిర్వహిస్తున్నారు. డిప్యూటేషన్ రద్దు కావడంతో యథాస్థానానికి వచ్చారు.

రైతుబజార్లలో నిబంధనలు పాటించాలి




క్వారీ మార్కెట్ రైతుబజార్‌ను పరిశీలిస్తున్న సీఈవో శేఖర్ బాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రైతుబజార్లలోని రైతులు, వ్యాపారులు, మహిళా సంఘాలు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం నడుచుకోవాలని రాష్ట్ర రైతుబజార్ల సీఈవో డాక్టర్ జి.శేఖర్‌బాబు అన్నారు. ఎటువంటి సొంత నిర్ణయాలు తీసుకోవద్దని ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం రాజమహేంద్రవరంలోని క్వారీ మార్కెట్, వై.జంక్షన్‌లోని రైతుబజార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుబజార్లలోని సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీని పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయాల కౌంటర్ పనితీరును తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా మార్కెటింగ్ అండ్ ట్రేడింగ్ అధికారి సునీల్ వినయ్, రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్లు శ్రీనివాస్, రోజియా ఉన్నారు.

పీఈటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల విద్యాలయాల సంస్థల్లో ఖాళీగా ఉన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల (పీఈటీ) భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా సమన్వయాధికారి జి.వెంకటరావు బుధవారం ఈ విషయాన్ని తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన భర్తీ చేస్తామన్నారు. గతంలో గురుకులంలో పని చేసిన వారికి ఏడాదికి ఒక మార్కు చొప్పున గరిష్ఠంగా ఐదు మార్కులు ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి తమ దరఖాస్తులను ఈ నెల 3వ తేదీలోపు జిల్లా కోఆర్డినేటర్, కలెక్టరేట్ కాంపౌండ్, వికాస ఆఫీస్, కాకినాడ అనే చిరునామాలో అందజేయాలని కోరారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: సమస్యలు నివేదించడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బంది, అధికారులకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. అమర్యాదగా ప్రవర్తిస్తున్నారంటూ పలువురు సిబ్బంది, అధికారులపై ఫిర్యాదులు అందాయన్నారు. కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలల సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. గంజాయి, రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. సోమవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చే సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటును ప్రతి పోలీస్ అధికారి పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు భాస్కరరావు, శ్రీలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.


కొండచిలువ హతం

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెం ప్రధాన రహదారిలో మంగళవారం రాత్రి భారీ కొండచిలువ హల్‌చల్ చేసింది. రోడ్డు దాటుతుండగా స్థానికులు, ప్రయాణికులు గుర్తించారు. సుమారు 8 అడుగులు పొడవు ఉన్న కొండ చిలువను చూసి భయభ్రాంతులకు గురయ్యారు. అటుగా వెళుతున్న ఓ వ్యక్తి కొండ చిలువను హతమార్చాడు. వరదలకు పాములు కొట్టుకు వస్తున్నాయని, నివాస ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలువురు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



GOLD FINANCE



■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2550]



■ కాకినాడ Foton Decors ఇండస్ట్రీ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన Marketing Executives (M) కావలెను. టూ వీలర్ తప్పనిసరి. సంప్ర॥ 88826 56789 [R-1229034]

■ రాజమండ్రి AVA రోడ్‌లో గల జగన్ ఆర్థోకేర్ హాస్పిటల్ నందు పనిచేయుటకు 1) నర్సులు, 2) వార్డు బాయ్స్, 3) ఆయాలు కావలెను. ✆ : 88852 97999 & 83416 10055 [R-705]

■ కష్టమైనా సరే కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000,ఫ్రీ రూం+భోజనం.HYD.Ph: 6309020999 [HA-432]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 81218 18692 [M-1185372]

■ Job Vacancy : YIP PVT LTD. Age : 18 to 45 Yrs. Qual. : 10th to Any Degree, Salary : 18000/- to 25000/- (Work From Home Available). ✆ 89789 45341. [M-1185373]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14415]

■ Wanted Male Counselors in a Reputed Educational Organisation Qualification Any Degree. Age Limit: 25 to 45, Salary Upto: 16000/-. Location: Rajahmundry. Cont: 9248733370 [G-5583]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.